క్లుప్తంగా

మాజీ సీఎం కేసీఆర్‌కు అరూరి పరామర్శ



వర్ధన్నపేట: మాజీ సీఎం కేసీఆర్‌ను వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ శుక్రవారం పరామర్శించారు. బాత్ రూమ్‌లో జారి పడి తుంటి ఎముక విరిగి శస్త్రచికిత్స చేయించుకుని హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతున్న సమయంలో కేసీఆర్‌ను అరూరి రమేశ్ కలిసి మాట్లాడారు. కేసీఆర్ త్వరలో కోలుకుని ప్రజాసేవలోకి రావాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు అరూరి తెలిపారు.

ఎస్సైని కలిసిన నాయకులు



చెన్నారావుపేట: స్థానిక ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, యువకులు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో ఎస్సైని సన్మానించారు. అనంతరం ఎస్సై మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు. ఎలాంటి సమస్యలున్నా, గ్రామాల్లో అపరిచితులు సంచరించినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

స్వెటర్ల పంపిణీ



నర్సంపేట రూరల్ : పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటున్న 50 మంది విద్యార్థులకు వార్డెన్ సదానందం శుక్రవారం స్వెటర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ సాంఘీక సంక్షేమ శాఖ గురుకులాల్లో వసతి పొందుతూ చదువుకుంటున్న విద్యార్థులకు చలి తీవ్రత నేపథ్యంలో స్వెటర్లు అందించిందని తెలిపారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఖానాపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన మండల కేంద్ర శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గూడూరు మండలంలోని మర్రిమిట్ట గ్రామానికి చెందిన రమేశ్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో రమేశ్‌కు గాయాలు కావడంతో స్థానికులు ఆయన్ను చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అన్నదానం

తొర్రూరు: అన్నదానం మహాదానమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకుడు హనుమాండ్ల తిరుపతిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ యువ నేత తూనం శ్రావణ్ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పెదగాని సోమయ్య, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వల్లభాయ్ పటేల్

తొర్రూరు: జాతీయ సమైక్యతకు కృషి చేసిన వల్లభాయ్ పటేల్ అందరికి ఆదర్శప్రాయుడని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు యాప సీతయ్య అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో సర్దార్ వల్లబాయి పటేల్ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు యాకయ్య, రాజేష్, కాగు నవీన్, జలగం రవి, చలపతిరాజ్, గంధం రాజులు పాల్గొన్నారు.

21న వేసెక్టమీ శిబిరం

ఐనవోలు: జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు వేసెక్టమీ శస్త్ర చికిత్సల పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 21వ తేదీన పురుషులకు కోత, కుట్టు లేకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌ను ప్రత్యేక వేసెక్టమీ శిబిరాల ద్వారా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకరు లేదా ఇద్దరు పిల్లల తర్వాత కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలని, ఈ ఆపరేషన్ 5 నిమిషాల్లో పూర్తవుతుందని పేర్కొన్నారు. వినియోగించుకోవాలని కోరారు.

నిరుపయోగంగా రైతు వేదికలు

● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



తాళం వేసి ఉన్న కల్లెడలోని రైతు వేదిక భవనం

పర్వతగిరి: గత రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం రైతు వేదికలను క్లస్టర్ల వారీగా ఏర్పాటు చేసింది. అవి రైతులకు పంట ఉత్పత్తుల అవగాహన కల్పించే వేదికలు కాగా ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. మండలంలోని పర్వతగిరి, కల్లెడ, వడ్లకొండ, కొంకపాక, ఏనుగల్ గ్రామాల్లో ఐదు రైతు వేదికలను నిర్మించారు. వాటిలో పర్వతగిరి, ఏనుగల్ గ్రామాల్లోని రైతు వేదికలు కొంత మేరకు ఉపయోగంలో ఉన్నాయి. కానీ రైతులకు అవగాహన కల్పించడం లేదు. కల్లెడలోని రైతు వేదిక విద్యుత్ సదుపాయం కల్పించకపోవడంతో తాళం తీసిన దాఖలాల్లేవు. అది అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్న వ్యాఖ్యలున్నాయి. కొంకపాకలోని రైతు వేదికను గ్రామానికి దూరంగా నిర్మించడం, గత గాలివానకు రేకులు కొట్టుకుకోవడం తెలిసిందే. వడ్లకొండలోని రైతు వేదిక పూర్తిగా నిరుపయోగంగా మారింది. రైతు వేదికల్లో ఏఈఓలు ప్రతీరోజు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు రైతులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తూ అవగాహన కల్పించాల్సి ఉన్నా వాస్తవంగా ఆ పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు.

ఉపయోగంలోకి తీసుకురావాలి



మండలంలోని రైతు వేదికలను ఉపయోగంలోకి తీసుకురావాలి. రైతు వేదికలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారడం బాధాకరం. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతు వేదికలను వ్యవసాయదారులకు ఉపయోగపడే దిశగా చొరవ చూపాలి.

-కంటెం సుధాకర్, రైతు, పర్వతగిరి

మూడు నిరుపయోగం..



మండలంలోని పర్వతగిరి, ఏనుగల్ రైతు వేదికలు ఉపయోగంలో ఉన్నాయి. కల్లెడలోని రైతు వేదికలో విద్యుత్ సరఫరా లేకపోవడం, కొంకపాక రైతు వేదిక గాలికి రేకులు లేచిపోయి, వడ్లకొండ రైతు వేదిక ఉపయోగంలో లేకుండా పోయాయి.

-ప్రశాంత్, మండల వ్యవసాయ అధికారి

మక్తల్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి

● మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేందర్



సమావేశంలో మాట్లాడుతున్న పులి దేవేందర్

చెన్నారావుపేట: ముదిరాజ్ కులానికి చెందిన నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసనసభ ఎన్నికల్లో 60 మంది లక్షల ముదిరాజ్ కులస్తుల ప్రతినిధిగా శ్రీహరి గెలిచాడని చెప్పారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో తెలిపిన మేరకు ముదిరాజ్ కులస్తులను బీసీ 'డీ' నుంచి బీసీ 'ఏ'లోకి మార్చాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, గ్రామ కులపెద్ద చీరబోయిన భిక్షపతి, సొసైటీ అధ్యక్షుడు చెలకల పెల్లి పెద్ద వీరస్వామి, ప్రధాన కార్యదర్శి ఈర్ల పెద్ద రమేశ్, ఉపాధ్యక్షుడు చిన్న రమేశ్, డైరెక్టర్లు కృష్ణ, ఐలుమల్లు, అజేందర్, రాంబాబు, చేరాలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుడి ఆశీస్సులతో దొంతి గెలుపు

● కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

దుగ్గొండి: మండలంలోని కొమ్మాల శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆశీస్సులతో నర్సంపేట ఎమ్మెల్యేగా దొంతి మాధవరెడ్డి రెండోసారి గెలుపొందారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపెల్లి రవీందర్ రావు తెలిపారు. పాదయాత్రలో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందుతుందని చెప్పారు. రైతులను రాజుగా చేసే ఏకైక ప్రభుత్వంగా కాంగ్రెస్‌ను అభివర్ణించారు. నియోజకవర్గ ప్రజల మన్ననలతోనే దొంతిని విజయం వరించిందని తెలిపారు. అనంతరం తక్కళ్లపల్లి రవీందర్‌రావును మండల మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకురాలు కోతి మమత శాలువాలతో సత్కరించారు. తదనంతరం ఆలయంలో మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో నాయకులు మండల నాయకులు పెండ్యాల రాజు, ఆవుల నర్సింహారెడ్డి, అండ్రు రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఖానాపురం: పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోదండ రామాలయంలో పూజలు

ఖానాపురం: నర్సంపేట ఎమ్మెల్యేగా దొంతి మాధవరెడ్డి గెలిచిన నేపథ్యంలో మండలంలోని అశోక్‌నగర్‌లోని కోదండ రామాలయంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొమ్మాల ఆలయం వరకు పాదయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు సంక్షేమ పథకాలు అమలౌతాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సాంబయ్య, సుమన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్ మొగిచర్ల జెడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థులు ఆడెపు ధర్మతేజ, నమిండ్ల అనిఖ్ ఈనెల 16 నుంచి తొర్రూరులో జరగనున్న రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పాలెపాక అనిత, పీఈటీ భీమగాని ముఖర్జీ తెలిపారు. ధర్మతేజ, అనిఖ్ మహబూబాబాద్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి 17 ఏళ్లలోపు విభాగం పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

వైద్యశిబిరం

దుగ్గొండి: మండలంలోని గిర్నిబావిలోని మహాత్మ జ్యోతిబా పూలే (ఎంజేపీ) గురుకుల పాఠశాలలో దుగ్గొండి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 300 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కిరణ్‌రాజ్, పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ దేవేందర్, వైద్య సిబ్బంది రోజమ్మ, విజయలక్ష్మీ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నేడు (16న) ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ డీఈ సదానందం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా సరఫరా నిలిపేయనున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. అవసరాన్ని బట్టి సింగిల్ ఫేజ్ సరఫరా అందిస్తామని వివరించారు.

పట్టణ అధ్యక్షుడిగా నాగరాజు



గూడూరు: గూడూరు పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వడ్డెరగూడేనికి చెందిన వల్లెపు నాగరాజు, ఎస్సీ కాలనీకి చెందిన హెచ్ శివను పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తున్నట్లు శుక్రవారం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంకర అయ్యప్పరెడ్డి ఒక ప్రకటనలో తెలిపాడు.

గిరిజన కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి

గూడూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఏజెన్సీ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లెం కోటి కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర ప్రచార కార్యదర్శి తాటి మధు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018లో ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయలేదన్నారు. పైగా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులను కూడా జీఓ నంబర్ 145 ప్రకారం గౌరవించకుండా నిర్వీర్యం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి వచ్చిన వెంటనే జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దబ్బకట్ల సుమన్ పాల్గొన్నారు.

బడిబయటి పిల్లల గుర్తింపు

తొర్రూరు రూరల్: మండలంలోని 29 గ్రామాల్లో జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడికి పంపించే కార్యక్రమాన్ని శుక్రవారం కొనసాగించారు. ప్రధానంగా సీఆర్‌పీలు వీణ, కల్పన, రాధిక, భాస్కర్, రమేష్‌లు ఆధ్వర్యంలో బడికి వెళ్లని పిల్లలను గుర్తించారు.

బాలికల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న సునంద

గూడూరు: నేటి ఆధునిక సమాజంలో ఆడ పిల్లలు ధైర్యంగా ఎదుగుతూ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని షీ టీం ఎస్సై సునంద అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా ఎస్పీ సంగ్రామ్‌సింగ్ ఆదేశం మేరకు అడిషనల్ ఎస్పీ చెన్నయ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆపద సమయంలో డయల్ 100, షీ టీం నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఏదైన ఇబ్బందికర సమయంలో షీ టీం నంబర్‌తో పాటు వాట్సాప్ నంబర్స్ 87126 56935, 790114 22009లకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిబాబా, రవీందర్‌రెడ్డి, ఏఎస్సై ఆనందం, శ్యాంసుందర్, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, బుల్లెట్ కాట్ పీసీ ఐలయ్య, నవీన్, షీ టీం కానిస్టేబుల్ రమేష్, పార్వతి, ఊర్మిల, భరోసా లాయర్ సాహిత్య పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఐనవోలు: విద్యార్థుల ప్రగతిని ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలని ఐనవోలు కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆవుల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఉడుతగూడెం, లింగమోరిగూడెం, గర్మిళ్లపల్లి పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తొలిమెట్టు రికార్డులను పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఎఫ్‌ఎల్‌ఎన్‌కు సంబంధించి బేస్‌లైన్‌టెస్టు, మాసవారి పరీక్షల్లో విద్యార్థుల ప్రగతిని యాప్‌లో పొందుపరచాలని అన్నారు. 27వ తేదీన పాఠశాల స్థాయిలో, 28న మండల స్థాయిలో సమీక్ష జరిపి వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలని అన్నారు. ఆరు నాన్ నెగోషియబుల్స్‌కు అనుగుణంగా పాఠ్యాంశ బోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ చుంచుకాల లింగారావు, సీఆర్‌పీ రేవతి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖకు సన్మానం



మంత్రి సురేఖను అభినందిస్తున్న నాయకులు

పరకాల: రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖను పరకాల, నడికూడ మండలాల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. సన్మానించిన వారిలో పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, డీసీసీ చేనేత సెల్ జిల్లా చైర్మన్ దాసరి భిక్షపతి, ఎంపీటీసీ పర్నెం మల్లారెడ్డి, సర్పంచ్ చాడ తిరుపతిరెడ్డి, మల్లక్‌పేట మాజీ సర్పంచ్ అల్లం రఘునారాయణ, నాయకులు మంద నాగరాజు, అజయ్ యాదవ్ ఉన్నారు.

కొంగల కోలాహలం



శాయంపేట : మండల కేంద్రంలోని మైలారం గ్రామ శివారులో కొంగల కోలాహలం నెలకొంది. చలి తీవ్రత అధికమవడంతో ఎండగా ఉన్న పొలాల్లోకి ఇలా గుంపుగా చేరాయి. ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

'జీడీఎస్'లపై నిర్లక్ష్యం సరికాదు



చెన్నారావుపేట: నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



రాయపర్తిలో..

● వంటావార్పుతో నిరసన

చెన్నారావుపేట: జీడీఎస్ ఉద్యోగులపై నిర్లక్ష్యం సరికాదని యూనియన్ వరంగల్ డివిజన్ ప్రాంతీయ సహాయ కార్యదర్శి చింత సదానందం, భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వడ్లకొండ రాజ్‌కుమార్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు దొంతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా స్థానిక సబ్ పోస్టాఫీస్ ఎదుట తపాలా ఉద్యోగులు శుక్రవారం వంటా వార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సదానందం, రాజ్‌కుమార్‌గౌడ్, శ్రీకాంత్ మాట్లాడారు. గ్రామీణ తపాలా ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, 36 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి ఆర్థిక ఉన్నతి కల్పించాలని పెన్షన్‌తోపాటు ఇతర అన్ని రకాల ప్రయోజనాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగిశెట్టి శోభారాణి, పురం శివకుమార్, రంజిత్‌కుమార్, సునిల్‌కుమార్, సుమన్‌నాయక్, శ్యాంసుందర్, క్రాంతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

రాయపర్తి: మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్ ఎదుట జీడీఎస్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాల్గో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగులు నినాదాలు చేశారు. సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమ్మెకు సబ్ పోస్ట్‌మాస్టర్ సీహెచ్.ఎల్లయ్య సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది అబిద్ పాషా, మైస చందర్, చారి, యాకయ్య, రాజు, శేషమ్మ, సంధ్య, రాజ్‌కుమార్, రాకేశ్, సంతోశ్, అర్జున్, తరుణ్, ఆస్మా, సోహా, అనిత, ఉపగ్న, నరేశ్‌కుమార్, అజయ్, మహేశ్, మోహన్, యాకూబ్, దీపిక, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడాకారిణికి అభినందన



చెన్నారావుపేట : విద్యార్థినిని అభినందిస్తున్న పీఈటీ రమేశ్

చెన్నారావుపేట: మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్ విద్యార్థి బానోతు సీత జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికవగా ఆమెను ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, పీఈటీ రమేశ్ శుక్రవారం అభినందించి మాట్లాడారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో నేటి (16) నుంచి 19 వరకు జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. సీతకు ఖర్చుల కోసం ఉపాధ్యాయులు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుగులోతు శేఖర్, రాజ్‌కుమార్, రాజేందర్, అనిల్, శృతి పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థికి..



సంగెం: షీల్డ్‌తో శ్రీకాంత్

సంగెం: అంతర్జాతీయ క్రీడాకారుడిగా రాణిస్తున్న మండలంలోని ఎల్గూర్ రంగంపేటకు చెందిన ఇమ్మడి పూర్ణ-మొగిలి దంపతుల కొడుకు శ్రీకాంత్‌ను గ్రామస్తులు అభిందించారు. శ్రీకాంత్ ఇటీవల నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ ఖోఖో క్రీడల్లో పాల్గొని మెరిట్ స్థానంలో నిలిచి గ్రామానికి చేరుకున్నాడు. శ్రీకాంత్ నర్సంపేట గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాల పీడీ వెంకటేశ్వర్లు, పీఈటీ ప్రశాంత్ ప్రోత్సాహంతో ఖోఖో ఆటలో రాణిస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో విజయం సాధించడం పట్ల తల్లితండ్రులు, గ్రామస్తులు శ్రీకాంత్‌ను అభినందించారు.

మానవ హక్కుల పరిరక్షణ బాధ్యత



మాట్లాడుతున్న ఎర్రబోయిన రాజశేఖర్

నర్సంపేట: మానవ హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతీ ఒక్కరిపైనా ఉందని జెడ్పీ బాయ్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రమేశ్, ఏఎస్ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో ఏఎస్ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మానవ హక్కుల వారోత్సవాల్లో వారు మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రజలు అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. మానవ హక్కులపై విద్యార్థి దశలోనే తెలుసుకుంటే బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని చెప్పారు. హక్కుల ఉల్లంఘన జరుగకుండా, హక్కుల పరిరక్షణ కోసం ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ బాధ్యుడు బెజ్జంకి ప్రభాకర్, ఉపాధ్యాయులు కృష్ణారావు, భిక్షపతి, బుచ్చిరాములు, ఉమామహేశ్వర్, రమేశ్, శైలజ, ఎం.రమేశ్, శ్రీలత, సంస్థ సభ్యులు రాము సేవక్, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం కమిటీ ఎన్నిక



మార్కండేయ చిత్రపటానికి పూజ చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

నర్సంపేట రూరల్ : పట్టణంలోని సర్వాపురంలో పద్మశాలి సంఘం నూతన గ్రామ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు కుసుమ భద్రయ్య, ఉపాధ్యక్షుడు కోదాటి మోహన్ తెలిపారు. అధ్యక్షుడిగా కూచన రవీందర్, ప్రధాన కార్యదర్శిగా సామల ఏల్లేశం, ఉపాధ్యక్షులుగా కుసుమ భాస్కర్, గూట్ల కనకయ్య, కోశాధికారిగా సిరిమల్లె నరేందర్, సహాయ కార్యదర్శిగా సంగెపు హరిప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా కుసుమ నర్సయ్య, వలపదాసు రవీందర్, గంజి రామకృష్ణ, నల్ల రంజిత్, దుస్స శ్రీకాంత్, దేవులపల్లి వేణు, ముఖ్య సలహాదార్లుగా సంగెపు నారాయణ, కూచన రాజు, బోగి మల్లయ్య ఎన్నికైనట్టు వివరించారు. అనంతరం పద్మశాలి నూతన కమిటీ వారి ఆరాధ్యమైన మార్కండేయ చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దాడులను ధైర్యంగా తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సతీష్‌బాబు

మామునూరు: తమపై జరుగుతున్న దాడులు, అకృత్యాలను బాలికలు, మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలని సబ్ డివిజన్ ఏసీపీ సతీష్ బాబు సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాల ఆడిటోరియంలో ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కమల్‌యాదవ్ అధ్యక్షతన మహిళా హక్కులు, చట్టాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఏసీపీ మాట్లాడుతూ మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. బాధిత మహిళలు 181 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో సఖి అడ్మినిస్ట్రేటర్ శ్రీలత, ఏఎస్సై వేణుగోపాల్‌రెడ్డి, షీటీమ్ ఎస్సై విద్యాసాగర్, ఇందిర, లా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.